క్లుప్తంగా

చిరుధాన్యాల సాగుపై అవగాహన

నింద్ర: మండలంలోని అగరం గ్రామంలో రైతులకు చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అదేవిధంగా సజ్జ పంట సాగులో తీసుకోవాల్సిన సూచనలు ఇచ్చారు. విత్తనశుద్ధి చేయడం వల్ల జరిగే మేలు గురించి వివరించారు. రైతులు సజ్జపంటలో కలుపు నివారణపై, సస్య రక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు విత్తనశుద్ధి, మందులపై అవగాహన ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ తులసీరాం, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై దృష్టి పెట్టండి

నింద్ర: వర్షాలకు ప్రజలు అతిసార, డయేరియా వ్యాధుల బారిన పడకుండా పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ భవానీ సూచించారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రస్తుతతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, నిత్యం పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలని ఆదేశించారు. ట్యాంకుల్లో నీటిని నింపిన ప్రతిసారి క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం : మండలంలోని చవటగుంటలో ఉన్న ఆవుదేవ ర మీనాక్షి సమే త నందీశ్వర స్వామి ఆల యంలో సోమ వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వే కువ జామునే సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో నందీశ్వరుని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై వెలసిన కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు.

ట్రిపుల్ ఐటీకి ఆర్‌కేఎస్‌ఆర్ విద్యార్థి



చైతన్య

కార్వేటినగరం: వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి స్థానిక ఆర్‌కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.చైతన్య ఎంపికైనట్లు ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఈ మేరకు పాఠశాలలో చైతన్యను ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. చైతన్యను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి ఉన్నత విద్యకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చైతన్య తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంసాపురం రోడ్డు



కొత్త వెంకటాపురం ఆది ఆంధ్ర వాడ



గతుకుల మయం.. గుంతల భయం!

- ఛిద్రమైన రహదారులు
- వాహనదారులకు తప్పని పాట్లు
- ప్రయాణికులకు ఇక్కట్లు

గంగాధరనెల్లూరు మండలంలో రహదారులు అధ్వానంగా మారిపోయాయి.. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా ఛిద్రమయ్యాయి. మోకాలిలోతు గుంతలతో దారుణంగా తయారయ్యాయి. ఆయా మార్గాల్లో పయనించే వాహనదారులకు నరకం కనిపిస్తోంది. బస్సుల్లో ప్రయాణించే వారికి సైతం కుదుపులతో నడుములు విరిగే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు కనీస మరమ్మతులు చేయించాలని మండలవాసులు కోరుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు. – గంగాధర నెల్లూరు



బొమ్మ వారి పల్లి రోడ్డు



మహా దేవ మంగళం చెరువు కట్ట పైన

కమనీయం.. ద్రౌపదీదేవి కల్యాణం



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళుతున్న ఉభయకర్తలు

వెదురుకుప్పం : మండలంలోని నల్లవెంగనపల్లె సమీపంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం అమ్మవారి కల్యాణం కమనీయంగా సాగింది. ఈ సందర్భంగా ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం హరికథా కాలక్షేపం చేపట్టారు. సాయంత్రం ఆలయం ఆవరణలో పెళ్లిపందిరి ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. పట్టుపీతాంబరాలు, సుగంధపరిమళాలు వెదజల్లే పుష్పమాలికలతో ముస్తాబు చేశారు. పండితుల వేదమంత్రాలు మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా మాంగల్యధారణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమానికి రాజేష్ రెడ్డి, బాలాజీరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ, సింగిల్‌విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, తోయాక్షురెడ్డి, బాలాజీరెడ్డి పాల్గొన్నారు.

వేధిస్తున్న ఇసుక కొరత

విజయపురం : మండలంలో ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుక లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మండలంలో చాలాచోట్ల ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే వీరికి అవసరమైన ఇసుక లేకపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోతున్నాయి. మండల పరిసరాల్లో ఎక్కడా గానీ ఇసుక రీచ్‌లు లేవు. దీంతో ఇసుక కొరత వేధిస్తోంది. ఇసుక కావాలంటే నాగలాపురం మండలం సురుటుపల్లెకు వెళ్లాలి. విజయపురం నుంచి సురుటుపల్లెకు సుమారు 45 కిలోమీటర్ల దూరం ఉంది. అక్కడ ఒక ట్రాక్టర్ ఇసుక సుమారు రూ.5 వేలు నుంచి రూ.6 వేలకు అమ్ముతున్నారు. దీంతో ఇళ్ల నిర్మాణం చేయడానికి స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ప్రజలకు అవసరమైన ఇసుక అందించాలని కోరుతున్నారు.

విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీ -1912

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేయాలని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. లేకుంటే ప్రాంతాల వారీగా ఏఈలకు కాల్ చేసి సమస్యను తెలపవచ్చారు. జిల్లాకు వర్ష సూచన ఉండడంతో వినియోగదారులు విద్యుత్ పరికరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మూడు నియోజకవర్గాల పరిధిలో ప్రజలు తమ విద్యుత్ సమస్యలు తెలుపడానికి ఏఈల నంబర్లను తెలియజేశారు. మిట్టూరు సెక్షన్ – 9440811825, గిరింపేట – 9440811826, సంతపేట – 9400811890, కొంగారెడ్డిపల్లె – 9440811827.

రూరల్ – 2 సబ్ డివిజన్

ఆవులకొండ – 94408 11837, జీడీనెల్లూరు – 94408 11838, పెనుమూరు – 94408 11839, పూతలపట్టు – 94408 11840, పాలసముద్రం – 94408 11841.

రూరల్ – 3 సబ్‌డివిజన్

కొత్తపల్లె – 94408 11832, రెడ్డిగుంట – 94408 11828, చిత్తూరు రూరల్ – 94408 11829.

సబ్సిడీ యంత్రాలకు దరఖాస్తు చేసుకోండి

విజయపురం : సబ్సిడీ ద్వారా అందించే వేరుశనగ నూర్పిడి యంత్రాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రజనికుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎఫ్‌పీఓ ఆర్గనైజేషన్ ద్వారా వేరుశనగ నూర్పిడి, గానుగ యంత్రంతో పాటు వివిధ రకాల యంత్రాలను సబ్సిడీ ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. యంత్రం విలువను బట్టి 50 శాతం నుంచి రూ.2 లక్షల వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. ఎఫ్‌పీఓ సభ్యులు మాత్రమే అర్హులని ఆమె పేర్కొన్నారు. అలాగే మొత్తం నగదు చెల్లించి తీసుకోవాలని, ఆ తరువాత వారి ఖాతాలో సబ్సిడీ డబ్బు జమ అవుతుందన్నారు. వివరాలకు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని కోరారు.

వేడుకగా 'బలి బండి కూడు'

కార్వేటినగరం : మండల కేంద్రంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం వేడుకగా బలి బండి కూడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయంలో బకాసురునికి బండిలో కూడు తీసుకెళ్లి భీముడు సంహరించే ఘట్టాన్ని భాగవతారిణి రెడ్డెమ్మ హరికథా కాలక్షేపంలో కనులకు కట్టినట్టుగా వివరించారు. ఈ క్రమంలో సాయంత్రం భీమ వేషధారి ఎడ్ల బండిపై కూడు తీసుకెళ్లే సన్నివేశాన్ని ప్రదర్శించారు. ఈ ఘట్టం వీక్షించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ మేరకు ఆలయంలో మూల మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్, సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.



పుర వీధుల్లో ఊరేగుతున్న ద్రౌపదీ అమ్మవారు

నేడు కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం ద్రౌపదీదేవి, ధర్మరాజస్వామివారికి వైభవంగా కల్యాణం జరిపించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్ తెలిపారు.



బలి బండి కూడుతో భక్తులను ఆకట్టుకుంటున్న భీముని వేషధారి

విలీనం చేసిన స్కూల్‌ను ప్రారంభించండి



ఎంఈఓలకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నగరి : పీసీఎన్ ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన నగరి బాలికల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గతంలో లాగే నిర్వహించాలని పెరుమాళుగుడి వీధికి చెందిన ప్రజలు ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయంకు వినతిపత్రం అందించారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయానికి వెళ్లిన వారు 1933 నుంచి 90 ఏళ్లపాటు ఎంపీపీ బాలికల పాఠశాల పెరుమాళు గుడివీధిలో నిర్వహణలో ఉందన్నారు. ఈ ప్రాంతం వారు బస్టాండు సమీపంలో ఉన్న పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చావడి సర్కిల్, బేరీవీధి సర్కిల్ అంటూ రోడ్డు దాటుకుంటూ వెళ్లాల్సి ఉందన్నారు. తాము ఆ మార్గంలో పిల్లలను పంపే సాహసం చేయలేకపోతున్నామని తెలిపారు. వసతులు లేని సమయంలోనే తాము పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపేవారమని ప్రస్తుతం నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ స్కూళ్లు కార్పొరేట్ స్కూళ్ల కంటే బాగున్నాయని, అందుకే తమ పిల్లలను సర్కారు బడికి పంపుతున్నామని అన్నారు. 3, 4, 5 తరగతులను విలీనం చేశారని, తిరిగి బాలికల ఎంపీపీ పాఠశాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం



సిమెంట్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

విజయపురం : మండలంలో ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు పడుతున్నాయి. కొన్నిచోట్ల రోడ్లు బురదమయంగా మారాయి. మరి కొన్నిచోట్ల సిమెంట్ రోడ్డుపై వర్షపు నీరు నిలిచాయి. వర్షం పడుతూనే ఉండడంతో ఇళ్లలో నుంచి బయట రాకుండా ఉండిపోయారు. ఇలాగే ఉంటే ఆరుతడి పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

ముగిసిన వారాహి ఉత్సవాలు

సత్యవేడు: వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం అమ్మవారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి, హోమం పూజలు నిర్వహించారు. ముందుగా వారాహి దేవికి సామూహిక సహస్ర నామార్చన చేశారు. అమ్మవారి పూజకు ఐదు ప్రమిదల్లో దీపాలు వెలిగించి, నైవేద్యంగా పానకం సమర్పించారు. ఈమెను ఆరాధిస్తే జీవితంలో ఎదురయ్యే అడ్డంకులు తొలగిపోతాయని, శత్రుభయం ఉండదని, జ్ఞానం సిద్ధిస్తుందని ఇక్కడి ప్రజలు విశ్వశిస్తారు.



విశేష అలంకరణలో వారాహి అమ్మవారు

సాయంత్రం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్త రవి కుమార్ దేవర్, పూజరులు మల్లికార్జున ప్రసాదాలు అందజేశారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

- 17న వేడుకలు ముగింపు
- హిందూ ముస్లింలు కలిసి జరుపుకునే పండుగ



నింద్ర: గ్రామంలో ఊరేగిస్తున్న పీర్లు

నగరి : హిందూ ముస్లింలంతా కలిసికట్టుగా జరుపుకునే మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇది పేరుకు ముస్లింల పండుగైనా పలు గ్రామాల్లో హిందువులు కూడా సంక్రాంతి, ఉగాది, దీపావళి, దసరాలతో సమానంగా ప్రాధాన్యత ఇస్తూ జరుపుకుంటారు. కులమతాలకు అతీతంగా వెండి, ఇత్తడి పంచలోహాలతో ఎవరి శక్తి కొద్దీ వారు మొక్కుల రూపంలో పీర్లను తయారు చేయించి ప్రార్థనలు చేయడం విశేషంగా చెప్పుకోవచ్చు. తాము చేయించిన పీర్లకు ఏటా మొహర్రం సందర్భంగా భక్తులు పూలు, దుస్తులు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఏటా మొహర్రం నెలలో నెలవంక కనిపించిన మూడవ రోజు.. అంతవరకు పెట్టెలో భద్రపరిచిన పీర్లను నిర్వాహకులు దించి, శుభ్రపరిచిన అనంతరం చదివింపులు చేసి ప్రత్యేక ప్రార్థనలతో పీర్ల చావిడిలో నిలుపుతారు. నిర్దేశిత దినాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పీర్లను ఊరేగిస్తారు. ఈ సందర్భంగా చక్కెర, పప్పులు, బొరుగులు, బెల్లాన్ని భక్తులు చదివిస్తారు. అనంతరం అందరికీ పంచిపెడతారు. ఈ పర్వదినాల్లో చివరి మూడురోజులు ముఖ్యమైనవి. పలు ప్రాంతాల్లో పీర్ల ముందు అగ్నిగుండాలు ఏర్పాటు చేస్తారు. గ్రామోత్సవాల అనంతరం పీర్లను మోస్తూ అందులో నడుస్తారు. మొహర్రం రోజు ఉదయం పీర్లు సలాం అందుకుంటాయి. అనంతరం సాయంత్రం పీర్లను తిరిగి ఊరేగించి రకరకాల వేషధారణలు, కర్రసాములతో ఒకరిపైనొకరు గంధం, రంగులు చల్లుకుంటూ పండుగను వైభవోపేతంగా నిర్వహిస్తారు. చివరి రోజున పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పలువురికి అన్నదానం చేస్తారు.



నగరి పీర్ల చావడిలో ఏర్పాటు చేసిన పీర్లు

ఇదీ విశిష్టత..

ముస్లిం క్యాలెండర్ హిజ్రి ప్రకారం 12 మాసాల్లో మొహర్రం మొదటి నెల. ఈ నెలలో నెలవంక కనిపించిన మూడవ రోజు నుంచి మొహర్రం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఇస్లాం మత ధర్మం కోసం దేవుడి మార్గంలో ప్రాణాలర్పించిన త్యాగమూర్తిగా హజరత్ ఇమామ్ హుసేన్ నిలిచాడు. మహమ్మద్ ప్రవక్తముని మనవడైన ఆయనను స్మరించుకుంటూ ఈ ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీ. మొహర్రంను పీర్ల పండుగ అని కూడా పిలవడం పరిపాటి. ఈ నెల 16వ తేదీ రాత్రి అన్నదాన కార్యక్రమానికి, 17న మొహర్రం పండగను జరపడానికి నిర్వాహకులు అన్నిరకాల ఏర్పాట్లను పూర్తి చేశారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని అగరంపేట గ్రామంలో మొహర్రం పండుగ పురస్కరించుకుని నేడు ఎనిమిదో రోజు పీర్లను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా సాయంత్రం చావడి వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు చేశారు. భక్తులు గంధం పూసి పీర్లను మెక్కుకున్నారు. బుధవారం ఉదయం అగ్నిగుండం ప్రవేశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రజాధనం 'నీళ్ల' పాలు

- కార్యాలయ ఆవరణలోనే వాటర్ ప్లాంటు
- అయినా వాటర్ బాటిళ్ల కొనుగోళ్లు
- సచివాలయాలకు గుక్కెడు నీళ్లివ్వని వైనం
- నీటి బిల్లుల పేరిట రూ.లక్షల్లో చెల్లింపులు
- చిత్తూరు కార్పొరేషన్‌లో అధికారుల లీలలు

చిత్తూరు అర్బన్: అయిన వాళ్లకు కంచాల్లో అనే సామెతను గుర్తు చేస్తూ.. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో తాగడానికి ఉపయోగించే నీటి నుంచి కొందరు అధికారులు డబ్బులు దండుకుంటున్నారు. ఎవరో కాంట్రాక్టర్‌ను బతికించడానికి ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ, అందులోంచి వచ్చే కమీషన్ల కోసం కక్కుర్తిపడుతున్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజారోగ్య, ఇంజినీరింగ్, మెప్మా, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, గణాంక, ప్రధాన కార్యాలయ విభాగాలున్నాయి. వీటన్నింటిలో కలిపి దాదాపు 60 మంది వరకు అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. వీళ్ల తాగడానికి అన్నట్టు, వాటర్ బాటిళ్లను సరఫరా చేసినట్టు బిల్లులు చూపించిన అధికార యంత్రాంగం ఏటా రూ.లక్షల్లో ఖర్చు పెడుతోంది. ఇప్పటికి దాదాపు రూ.10 లక్షల వరకూ ప్రజాధనం వృథా చేసినట్టు సమాచారం. కార్యాలయంలో లోపల ఉన్న ఉచిత శుద్ధి నీటిని అందరూ ఉపయోగించుకుంటే మునిసిపాలిటీపై భారం తగ్గుతుందనే ఆలోచన కూడా చేయని అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు దారిస్తోంది.



కార్పొరేషన్ కార్యాలయంలో ఉంచిన వాటర్ బాటిల్స్

సచివాలయాల్లో తీరని దాహం

మరోవైపు కార్పొరేషన్ పరిధిలోని 50 సచివాలయాల్లో సిబ్బందికి, అక్కడకు వచ్చే ప్రజలకు నీరు అందించాల్సిన బాధ్యత కూడా కార్పొరేషన్ అధికారులే చూసుకోవాలి. కానీ దాదాపు ఏడు నెలలుగా సచివాలయాలకు నీళ్లను సరఫరా చేయలేదు. సచివాలయాల్లో పనిచేసే కార్యదర్శులు రోజూ ఇంటి వద్ద నుంచే నీటిని తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. ఇక్కడకు వచ్చే ప్రజల దాహం గురించి పట్టించుకునే దిక్కులేకుండాపోయింది. కార్పొరేషన్ కార్యాలయంలో గాడితప్పిన పాలనకు నీటి సరఫరా వ్యవహారం ఓ సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ విషయం ఇటీవల కమిషనర్ దృష్టికి వెళ్లడంతో, సచివాలయాలకు నీటి సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. ఫలితంగా ఇటీవల నీళ్ల సరఫరా మొదలైంది.


ఇపుడు క్యాన్లలో..

అధికారులకు మాత్రమే సరఫరా అవుతున్న వాటర్ బాటిళ్ల వ్యవహారంపై సామాజిక మాధ్యమాల్లో దుమారం రేగడంతో కార్పొరేషన్ పరువు పోయింది. దీంతో దిద్దుబాటు చర్యలకు దిగిన అధికారులు, వాటర్ బాటిళ్ల సరఫరా ఇపుడు వద్దని తాత్కాలికంగా ఆపేసినట్లు తెలుస్తోంది. వాటర్ బాటిళ్ల స్థానంలో 20 లీటర్ల పెద్ద క్యాన్లలో నీటిని కొనుగోలు చేయడానికి శ్రీకారం చుట్టారే తప్ప, ఇక్కడున్న శుద్ధినీటి ప్లాంటులో నీళ్లను ఉపయోగించుకుందామని మాత్రం అనుకోవడం లేదు. ఏది ఏం జరిగినా నీళ్ల సరఫరా చేసే వ్యక్తికి లబ్ధి చేకూర్చాలని కొందరు కంకణం కట్టుకున్నట్టు వ్యవహరిస్తున్నారే తప్ప, ప్రజాధనం ఆదా చేద్దామనే ఆలోచన చేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

> **ఆ నీళ్లు కొద్దిగా తేడా..**
>
> వాటర్ బాటిళ్ల కొనుగోలు ఇపుడు ఆపేశాం. 20 లీటర్ల క్యాన్లను తెప్పిస్తున్నాం. కౌన్సిల్ సమావేశాలకు మాత్రమే వాటర్ బాటిళ్లను తెప్పిస్తున్నాం. సచివాలయాల్లో నీటి సరఫరా పునరుద్ధరించాం. కార్యాలయంలో ఉన్న ప్లాంటులో వస్తున్న నీటిలో పీహెచ్ విలువ తేడా ఉందని తెలిసింది. దీన్ని బాగుచేయించి, అందరికీ ఇదే నీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటాం.
>
> – వెంకటరమణ, డీఈఈ, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్.

సంక్షేమ నిధిని పునరుద్ధరించాలి

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగుల సంక్షేమ నిధి(వెల్ఫేర్ ఫండ్)ని పునరుద్ధరించాలని టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ అన్నారు. సోమవారం స్థానిక టీటీడీ పరిపాలనా భవనంలో వెల్ఫేర్ కమిటీ, ఉద్యోగ సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ పలు నిర్ణయాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. టీటీడీ ద్వారా వెల్ఫేర్ ఫండ్‌లోని లోటును మ్యాచింగ్ గ్రాంట్ రూపంలో చెల్లించి వెల్ఫేర్ ఫండ్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ ఫండ్ రికవరీ రూ.45 నుంచి రూ.200 వరకు పెంచి ఈ స్కీమ్‌ను కొనసాగించాలని కోరారు. చనిపోయిన, పదవీ విరమణ పొందిన వారికి దాదాపు మూడేళ్లుగా చెల్లింపులు నిలిపేశారని.. వారికి గతంలో చెల్లించిన విధంగా వెల్ఫేర్ ఫండ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు గోవిందరాజన్(డిప్యూటీ ఈఓ) ఆనందరాజు(డిప్యూటీ ఈఓ), ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ యాదవ్, కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి రేఖ, సభ్యులు వంకీపురం పవన్, అశోక్ కుమార్, విశ్వనాథ్, సారిక, బాబు, తేజేశ్వర్ రెడ్డి, ఈశ్వర్ నాయక్, ఉద్యోగ సంఘ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశమైన టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు